## బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19: మండలంలోని బూరుగూడా గ్రామానికి చెందిన లేకురి రవి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం రవి కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గతంలో బావిలో దూకేందుకు ప్రయత్నించగా స్థానికులు కాపాడారు. ఈ నెల 18న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కవిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మద్యానికి బానిసై మహిళ మృతి

కాసిపేట, మే 19 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం భరత్ కాలనీలోని సంత సమీపంలోని సింగరేణి విద్యుత్ భవనం ఆవరణలో కుక్కల లలిత(48) మృతి చెందినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... భూపాలపల్లిలోని చెల్పూర్‌కు చెందిన కుక్కల లలిత 45 రోజుల నుంచి బెల్లంపల్లిలో, సోమగూడెంలోని కుటుంబీకుల వద్ద ఉంటూ తాగుడుకు బానిసై కుటుంబీకులు ఎంత చెప్పినా వినలేదని తెలిపారు. సోమవారం ఉదయం సోమగూడెంలోని సింగరేణి విద్యుత్ భవనం వద్ద మృతి చెంది ఉంది. మద్యానికి బానిసై ఆహారం తినకుండా ఉండడంతోనే మృతి చెందినట్లు కూతురు పెద్దపల్లి రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో బర్రెలు మృతి

వేమనపల్లి, మే 19 : మండలంలోని బుయ్యారం గ్రామ శివారులో సోమవారం విద్యుత్ షాక్‌తో రెండు బర్రెలు తిచెందాయి. బుయ్యారానికి చెందిన కొండి చిన్నబాపు, రాజయ్యకు చెందిన గేదెలు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లగా కర్రల సాయంతో తో వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ వైర్లు గేదెలపై పడడంతో విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. మృతిచెందిన బర్రెల విలువ సుమారు రూ. 90 వేలు ఉంటుందని, నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు. నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, వెటర్నరీ డాక్టర్ సుప్రియ , గోపాల మిత్ర శ్రీకాంత్ పరిశీలించారు.

## పేకాట స్థావరంపై దాడి

లక్షెట్టిపేట, మే 19 : పట్టణంలోని గోదావరి రోడ్డులో పేకాట స్థావరంపై సోమవారం ఎస్ఐ గోపతి సురేశ్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఎంబడి వెంకటేశ్, చిట్టు మల్ల రాకేశ్, అబ్దుల్ జాఫర్, బుద్దే రాయమల్లు , సాజిద్, గౌస్, గోవికారి వినోద్‌ను పట్టుకొని కేసు నమోదు చేసి, రూ. 2720 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## ఇసుక దోపిడీపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న షేక్ షరీఫ్

జైపూర్, మే 19: గోదావరి నది నుంచి ఇసుక దోపిడీ చేస్తున్నారంటూ ఇందారం గ్రామానికి చెందిన షెక్ షరీఫ్ సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఇందారం గోదావరినదిలో నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారిక ఇసుక రీచ్ ద్వారా అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మరికొంత మంది ఇందిరమ్మ ఇండ్ల పేరుతో స్థానిక ఎంపీడీవో అనుమతి తీసుకుని ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.3000 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించాడు. అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు.

## చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం నాయకులు

లక్షెట్టిపేట, మే 19: ఇటిక్యాల చెరువు భూమికి హద్దులు నిర్ణయించాలని మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు మేడి రాజేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెరువు ఎస్‌టీఎల్, శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందించినా ఇప్పటివరకూ పట్టించుకోవడం లేదన్నారు. కొందరు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని, దీంతో మత్స్యకారులకు ఉపాధి దెబ్బతింటున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మికులు మేడి నారాయణ, భీమన్న, పోచం, నర్సయ్య, చందు, చెరువు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు సప్ప రవి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కోయపోచగూడేన్ని పోడు లిస్టులో చేర్చాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దండేపల్లి, మే 19 : దండేపల్లి మండలంలోని మాకులపేట జీపీ పరిధిలోని కోయపోచగూడేన్ని పోడు లిస్టులో చేర్చాలని, వారికి ప్రభుత్వం హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కనికరపు అశోక్, దుంపల రంజిత్‌కుమార్ అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డీటీ విజయ, ఎంపీడీవో ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజలింగు, ఎల్లయ్య, రమేశ్, మహేశ్వరి, తార, బాపు, పోషవ్వ, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

మందమర్రి, మే 19: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 364 సర్వే నంబర్‌లో 1.30 ఎకరాల భూమిని ఒక వ్యాపారి కొనుగోలు చేసి ఫాంహౌస్ నిర్మించుకున్నాడని ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆదిల్‌పేట గ్రామ పంచాయతీలోని ఎర్రచెరువు అభివృద్ధికి పదేండ్ల క్రితం 1.30 కోట్లతో 30 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని దాని పై ఇంత వరకు హద్దులు గుర్తించలేదన్నారు. ప్రభుత్వ భూముల పై విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

## అటవీ భుములు స్వాధీనం



గ్రామస్తులతో మాట్లాడుతున్న దేవాపూర్ రేంజర్ అనిత

కాసిపేట, మే 19 : మండలంలోని సోనాపూర్ సెక్షన్ పరిధిలోని లక్ష్మీపూర్ బీట్ పరిధిలో అనర్హులైన పోడుదారుల నుంచి అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు దేవాపూర్ ఫారెస్ట్ రేంజర్ కే అనిత పేర్కొన్నారు. సోమవారం అటవీ భూములను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. పత్రాలు లేకుండా పోడు భూములు సాగు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్వో కే రాము, ఎఫ్‌బీవోలు సీహెచ్ ప్రమోద్, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## పేలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ఎగిసిపడుతున్న మంటలు

మందమర్రి, మే 19: మందమర్రి పట్టణంలోని స్టేషన్ రోడ్డు వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలి పోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అక్కడ ఎవనూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని ఎండల తీవ్రత, అధిక లోడు కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ పేలి ఉంటుందని తెలిపారు

## తాండూర్ తహసీల్దార్‌గా జ్యోత్స్న



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

తాండూర్, మే 19 : తాండూర్ మండల తహసీల్దార్‌గా యూ జ్యోత్స్న నియమితులయ్యారు. గతంలో బెల్లంపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన జ్యోత్స్న సోమవారం తాండూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఇమ్రాన్‌ఖాన్‌ను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా జ్యోత్స్నకు డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఆర్ఐలు ఎజాజొద్దీన్, పద్మజ, తహసీల్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రెవెన్యూ సేవలు, సర్టిఫికెట్ల జారీ వేగవంతం చేస్తామని తెలిపారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



అర్జీలు స్వీకరిస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్, మే 19 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలు, దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, మందమర్రి ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు దరఖాస్తులు అందజేశారు. ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

**కాసిపేట మండలంలో..**

కాసిపేట, మే 19 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం ఎనిమిది దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ప్రజావాణిలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ అంజయ్య, ఏవో చల్ల ప్రభాకర్, ఏపీఎం వెంకటేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

**అర్జీలను త్వరగా గతిన పరిష్కరించాలి**

**కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19:ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి దివ్యాంగ పింఛన్, పట్టా పాసుపుస్తకం, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇల్లు, ఉపాధి కల్పించాలని, తదితర సమస్యలపై అర్జీలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

• కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19: ప్రజావాణిలో అందిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ఆర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి సమస్యలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను ప్రజలు నమ్మవద్దన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

• కుమ్రం భీం ఆసిఫాబాద్‌అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



మురుగుకాలువ పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కాగజ్‌నగర్, మే 19 : అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. సోమవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించారు. వానకాలం ప్రారంభం లోగా పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో పారిశుధ్య పనుల చేయాలన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక చర్యలు

నస్పూర్, మే 19 : జిల్లాలో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ యజ్ఞంలా కొనసాగుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 345 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1. 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరిందని, 36 కొనుగోలు కేంద్రాల సేకరణ లక్ష్యం పూర్తి చేసి మూసివేసినట్లు తెలిపారు. జిల్లాలో 7 వేల మంది రైతుల ఖాతాల్లో 108 కోట్ల రూపాయలు జమ చేశామని, ధాన్యం సేకరణలో జిల్లాలోని 20 మిల్లులు, కరీంనగర్‌లోని 64 మిల్లులే కాకుండా పెద్దపల్లి జిల్లాలోని మిల్లులకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో ఏమైనా సమస్యలుంటే జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా అదనపు కలెక్టర్ అందుబాటులో ఉంటారని కాల్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఆర్టీసీ బస్సులో 3 తులాల గొలుసు చోరీ



ప్రయాణికుల బ్యాగును చెక్ చేస్తున్న బాధితురాలు

కౌటాల, మే 19: కాగజ్‌నగర్ నుంచి కౌటాలకు వచ్చే ఆర్టీసీ బస్సులో సోమవారం 3 తులాల బంగారం గొలుసు దొంగతనానికి గురైనట్లు బాదితురాలు అల్లి రమ్య తెలిపారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం రమ్య ఆమె తల్లి లక్ష్మి కూతురుతో కలిసి మంచిర్యాలలో బంధువుల పెండ్లికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో బంగారు గొలుసు దొంగతనానికి గురైనట్లు ఆమె తెలిపింది. కాగజ్‌నగర్ నుంచి చింతలమానేపల్లికి బస్సులో బయలుదేరింది. ఆమె బంగారు గొలుసును హ్యాండ్ బ్యాగులో భద్రపరిచింది. లోనవెల్లి దగ్గరకు వచ్చే సరికి ఆమెకు ఫోన్ రావడంతో బ్యాగు జిప్ తీసింది. అందులో గొలుసు కనిపించలేదు. వెంటనే రమ్య బస్సు డ్రైవర్, కండక్టర్లకు చెప్పింది. బస్సును కౌటాల మినీ స్టేడియం వద్ద చెక్‌పోస్టు వద్ద డ్రైవర్ ఆపి పోలీసులకు సమాచారం అందించారు. ప్రయాణికుల వద్ద ఉన్న అన్ని బ్యాగులను బాధితురాలు చెక్ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అక్కడే రోదిస్తూ ఉండిపోయిం ది. బంగారు గొలుసు విలువ సుమారు మూడు లక్షలు విలువ చేయడంతో ఆమె రోదిస్తూ బాధను వెల్లబోసుకున్నది.

## నేడు భీమారానికి మంత్రి రాక

భీమారం, మే 19 : భీమారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీ పాఠశాలలో నిర్వహించే భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ మంగళవారం రానున్నట్లు అధికారులు తెలిపారు. సభ ఏర్పాట్లను మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్, డీసీపీ భాస్కర్, ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

## రాజీవ్ యువ వికాసం మంజూరు చేయాలని వినతి

మందమర్రిరూరల్, మే 19 : మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకుడు చందు తనకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించాడు. తనది నిరుపేద కుటుంబమని నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్నానని, తనకు ఆర్థిక సహాయం అందిస్తే స్వయం ఉపాధి పొందుతానని తెలిపారు.

## మిషన్ భగీరథలో మురికినీరు !



మిషన్ భగరథ పైప్‌లైన్ నుంచి వచ్చిన మురికినీరు

భీమారం, మే 19: భీమారంలోని పలు కాలనీలతో పాటు వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు మురికిగా, దుర్వాసనతో వస్తున్నాయని కాలనీ ప్రజలు తెలిపారు. వాటిని తాగలేని పరిస్థితి నెలకొన్నదని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ ద్వారా శుద్ధజలాన్ని సరఫరా చేయాలని కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కాసిపేట, మే 19 : కాసిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మండల అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన కాసిపేట మండలంలోని దుబ్బగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై బేస్మెంట్ లెవెల్ వరకు రూ.లక్ష వరకు నిధులు విడుదల చేస్తున్నారని, ఇండ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీ నారాయణ, కార్యదర్శి సురేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి

• జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి డిమాండ్




మాట్లాడుతున్న జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

సీసీసీ నస్పూర్, మే 19: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీసీసీ కార్నర్ వద్ద జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికపరమైన రిజర్వేషన్లు చెల్లవని 1993లో ఇందిరా సహాని కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 103ను సవరించి ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడమంటే బీసీలకు తీవ్ర అన్యాయం చేసినట్లేనని అన్నారు. ఎలాంటి పోరాటాలు చేయకుండానే అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లను బీజేపీ ప్రభుత్వం కల్పించిందన్నారు. మండల కమిషన్ మేరకు బీసీలకు ఉద్యోగాల్లో 27శాతం కల్పించాల్సి ఉండగా, కేవలం 15శాతం మాత్రమే కల్పిస్తుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజెల్లి వెంకటయ్య, శాఖపురి భీంసేన్, సీపతి రాములు, తోకల వెంకటేశ్, వేముల కిరణ్, తదితరులున్నారు.

## దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

వాంకిడి, మే 19 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని ఒక కళాశాలలో బీటెక్ చవుతున్నా జేమ్స్ అనే దళిత విద్యార్థి పై అదే కళాశాలలో చదువుతున్న అగ్రవర్ణానికి చెందిన యశ్వంత్ నాయుడు, అతని గ్యాంగ్ అకారణంగా విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయ పరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రాంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కార్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ ఉప్రే, దుర్గం సందీప్, దుర్గం హంస రాజ్, తదితరులున్నారు.

## ఆదర్శనీయుడు సుందరయ్య




సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. సోమవారం ఆయన 40వ వర్ధంతిని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోట శ్రీనివాస్, రాజేందర్, కార్తిక్, టీకానంద్, కృష్ణమాచారి తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ముందుండాలి



విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19: ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కాగజ్ నగర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సీఈసీ పూర్తి చేసి 947 మార్కులతో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని ప్రేమలను డీఐఈవో కల్యాణితో కలిసి తన కార్యాలయంలో అభినందిస్తూ సన్మానించారు.

## అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19:జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్‌తో కలిసి విద్యాశాఖ, పోలీస్, వైద్య, విద్యుత్, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ, రోడ్డు రవాణా సంస్థ అధికారులతో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. రీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించి, బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో కల్యాణి, జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి ఉదయ్ బాబు, కళాశాలల ప్రిన్సిపాళ్ళు, అధ్యాపకులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్, మే 19 : కాగజ్‌నగర్ టౌన్‌లో ట్రీ కటింగ్ ఉన్నందున టౌన్‌లో మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. పట్టణంలోని ఆదర్శ్‌నగర్, బాలాజీనగర్, నౌగాం బస్తీ, మార్కెట్ ఏరియా, కౌసర్ మజీద్ ఏరియాలో వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

## నియామకం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 19: బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మామిడి కిరణ్ ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్ నార్ రమేశ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. కిరణ్‌ను సంఘ సభ్యులు సన్మానించారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

జైనూర్, మే 19: మండలంలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్టర్ చేసుకోవాలని జై నూర్ ఏడీఏ వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని దుబ్బగూడలో రైతులతో సమావేశం నిర్వహించి ఫార్మర్ రిజిస్టరీ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు ఈ నమోదు చేసుకోవడం వల్ల పీఎం కిసాన్, ఇన్ పుట్ సబ్సిడీ, సాగు సలహాలు వంటి పథకాలకు అర్హత పొందటానికి వీలుంటుందని , రైతుగా గుర్తింపు పొందటానికి ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. రైతులు అందరూ ఆధార్, పట్టా పాస్ బుక్ ఓటీపీ కోసం ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్ ఫోన్ ను వెంట తీసుకొని వెళ్లాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఈవోలు మేస్రం రాము, టీ వినోద రైతులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రెండో విడుత శిక్షణ

నస్పూర్, మే 19 : మంగళవారం నుంచి రెండవ విడుత ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపు శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లాలోని 9 శిక్షణ కేంద్రాల్లో 9 సబ్జెక్టులకు సంబంధించిన ఐదు రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## శిక్షణ తరగతులు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్, మే 19 : విద్యాభారతి హైస్కూల్‌లో ఈ నెల 20వ తేదీ మంగళవారం నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజుల పాటు మండలంలోని అన్ని ఎస్‌జీటీలు, ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం ఉపాధ్యాయుల కోసం ఎఫ్ఎల్ఎన్ అంశంపై నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఎస్ మల్లేశం కోరారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయని తెలిపారు.

## అర్హులైన పేదలకు రుణాలివ్వాలి

రెబ్బెన, మే 19:రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన అందరికి ఎలాంటి షరతులు లెకుండ సబ్సిడి లోన్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్(రెవెన్యూ) కు సోమవారం వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరిగెల మధుకర్‌గౌడ్, కుమ్రం దోందేరావు లు ఉన్నారు.